సాక్షి
ఖమ్మం



శనివారం । 8 । మార్చి । 2025



న్యూస్‌రీల్

నేడు జాతీయ లోక్‌అదాలత్

ఖమ్మంలీగల్: ఖమ్మం న్యాయసేవా సదన్‌లో శనివారం జాతీయ స్థాయి లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి చంద్రశేఖరరావు తెలిపారు. ఈ లోక్‌అదాలత్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కేసుల పరిష్కారం కోసం తొమ్మిది బెంచ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు.

రీజియన్‌లో మహిళా సంఘాలకు ఏడు బస్సులు

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ అద్దెకు తీసుకునే బస్సులను మహిళా సంఘాల ద్వారా సమకూర్చుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు తొలిదశలో కొన్ని బస్సులను మహిళా దినోత్సవమైన శుక్రవారం ప్రారంభించనున్నారు. ఇందుకోసం ఎంపిక చేసిన రీజియన్లలో ఖమ్మం కూడా ఉండగా ఖమ్మం, సత్తుపల్లి, మధిర డిపోలకు రెండు చొప్పున, ఇల్లెందుకు ఒక బస్సు కేటాయించారు. ప్రభుత్వ గ్యారంటీతో మహిళా సంఘాలకు లింకేజీ రుణాలు మంజూరు చేసి, ఈ రుణాలతో బస్సులు కొనుగోలు చేయించి ఆర్టీసీకి అద్దె ప్రాతిపదికన కేటాయిస్తారు.

ఇంటర్ పరీక్షకు 570మంది గైర్హాజరు

ఖమ్మం సహకారనగర్/ఏన్కూరు: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం రెండో పరీక్ష శుక్రవారం నిర్వహించారు. జిల్లాలోని 72కేంద్రాల్లో పరీక్ష జరగగా, 18,220మంది విద్యార్థులకు గాను 570మంది గైర్హాజరయ్యారని డీఐఈఓ కె.రవిబాబు తెలిపారు. కాగా, ఏన్కూరులో రెండు పరీక్షా కేంద్రాలను డీఐఈఓ తనిఖీ చేశారు. కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించి, సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అధికారులు సింహాచలం, శ్రీనివాస రెడ్డి, సుందరం పాల్గొన్నారు.

కాలేజీ భవన నిర్మాణానికి రూ.5.50 కోట్లు

కూసుమంచి: కూసుమంచికి ఇటీవల ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు కాగా రెవెన్యూ అకాడమీ భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. ఈమేరకు భవన నిర్మాణానికి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో నిధులు మంజూరయ్యాయి. భవన నిర్మాణానికి రూ.5కోట్లు, ల్యాబ్ పరికరాలు, కంప్యూటర్ల కొనుగోలుకు మరో రూ.50లక్షలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

టీఎన్జీవోస్ సొసైటీ ఎన్నికల నోటిఫికేషన్

ఖమ్మం సహకారనగర్: 'తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్' ఎన్నికల నగారా మోగింది. ఎన్నికల అధికారి అవధానుల శ్రీనివాస్ శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. మొత్తం 3,424 మంది ఓటర్లు ఉండగా, ఈనెల 10, 11, 12వ తేదీల్లో నామినేషన్లు స్వీకరిస్తారు. అలాగే, 13న స్క్రూటినీ, 15వ తేదీన నామినేషన్ల విత్ డ్రా పూర్తయ్యాక 21వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నారు. ఏడుగురు సభ్యులను ఎన్నికయ్యాక వీరి నుంచి అధ్యక్ష, కార్యదర్శుల తో పాటు ఇతర పదవులకు ఎన్నుకుంటారు.

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'అమ్మే నా తొలి గురువు. ఆమె పెద్దగా చదువుకోలేదు. కానీ నన్ను ముందుకు నడిపించింది. ఎక్కడ పడిపోతే.. అక్కడి నుంచే నీ కొత్త ప్రయాణం మొదలుపెట్టమని చెప్పింది. నన్ను జడ్జిగా చూడాలన్న ఆమె కోరికను నెరవేర్చగలిగాను. మహిళలు తమ లక్ష్యాలను చేరుకోవడానికి దృఢ సంకల్పంతో ముందడుగు వేయాలి.' అని జిల్లా ఒకటో అదనపు న్యాయమూర్తి కె.ఉమాదేవి పేర్కొన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం 'సాక్షి' యూనిట్ కార్యాలయంలో ఆమె గెస్ట్ ఎడిటర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా పేజీ లే ఔట్, మహిళా దినోత్సవ ప్రత్యేక కథనాలపై చర్చించి సూచనలు చేశారు. అనంతరం న్యాయమూర్తి ఉమాదేవి తన ప్రస్థానం, మహిళా సాధికారతపై వెల్లడించిన వివరాలు ఆమె మాటల్లోనే..

అడుగు ముందుకే..

- దృఢ సంకల్పంతో సాగితేనే విజయం
- నన్ను జడ్జిగా చూడాలన్నదే మా అమ్మ కల
- జిల్లా అదనపు న్యాయమూర్తి ఉమాదేవి

మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' గెస్ట్ ఎడిటర్‌గా విధులు



సాక్షి గెస్ట్ ఎడిటర్లుగా పేజీ లే ఔట్‌పై చర్చిస్తున్న జిల్లా అదనపు న్యాయమూర్తి ఉమాదేవి, కుటుంబ న్యాయస్థానం జడ్జి అర్చనాకుమారి

నిరాశకు తావివ్వొద్దు..

మహిళలు ఏ రంగాన్ని ఎంచుకున్నా.. అందులో వంద శాతం కృషి చేయాలి. ఏ పనైనా ఇష్టంతో చేయాలి. లక్ష్యాలను చేరుకోవడానికి దృఢ సంకల్పంతో ముందడుగు వేయాలే తప్ప ఎక్కడో ఏదో జరిగిందని కుంగిపోవద్దు. మనకు మన లక్ష్యమే కనపడాలి. మంచి, చెడును సమానంగా స్వీకరించగలిగే స్థితప్రజ్ఞత సాధించాలి. మహిళలు ఆత్మస్థైర్యాన్ని ఎప్పుడూ కోల్పోవద్దు. ఇక చాలు నా జీవితం అయిపోయిందనే భావనను మనసులోంచి తీసేయాలి. అప్పుడే అనుకున్న దాని కన్నా మంచి స్థితిలో ఉంటాం. చిన్నతనం నుంచే మహిళలకు తల్లిదండ్రుల ప్రోత్సాహం ముఖ్యం. వారి లక్ష్యాలకు అండగా ఉండాలి.

ఎవరేం అనుకుంటారోనని ఆలోచించొద్దు..

మహిళల్లో ఎక్కువ మంది వాళ్లేం అనుకుంటారో.. వీళ్లేం అనుకుంటారో అని ఆలోచిస్తుంటారు. అలా కాకుండా మనమేం అనుకుంటున్నామో అదే ముఖ్యం. నలుగురు ఏమనుకుంటారో అనే భావన తీసేస్తేనే జీవితంలో ఎదగగలుగుతాం. అప్పుడే ఎంత కఠినమైన పనైనా చేయగలం. జీవితంలో ఏదీ సులువు కాదనే విషయాన్ని అంగీకరించాలి.

అమ్మే నా మొదటి గురువు..

మేము నలుగురు ఆడపిల్లలం. నాన్న ఫిజికల్ డైరెక్టర్. ఆయన అందరినీ లెక్చరర్లుగా చేయాలనుకున్నారు. కానీ నన్ను జడ్జిగా చూడాలన్నది అమ్మ కోరిక. నా మొదటి గురువు ఆమే. ఏం చేయాలి.. ఎలా వెళ్లాలి.. ఎక్కడైతే పడిపోతామో అక్కడే లేచి నిలబడమని చెప్పేది.. అంత సపోర్ట్ ఉండడంతో ఆమె కల నెరవేర్చగలిగాను.

మనల్ని మనం నమ్మాలి..

- చిన్న ఓటమికే కుంగిపోవద్దు
- కుటుంబ న్యాయస్థానం జడ్జి అర్చనాకుమారి

'మహిళలు తమని తాము గుర్తించాలి. తమను తాముగా అంగీకరించగలగాలి. చిన్న ఓటమి ఎదురైనా కుంగిపోకుండా ముందుకు వెళ్లాలి. రేపు ఏం జరుగుతుందని కాకుండా.. వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలి.. నేను ఈ స్థాయికి రావడంలో అమ్మమ్మ, నానమ్మతో పాటు అమ్మ, అత్త పాత్ర ఎంతో ఉంది.' అని ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి ఎం.అర్చనాకుమారి పేర్కొన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా అదనపు న్యాయమూర్తి ఉమాదేవితో కలిసి 'సాక్షి' గెస్ట్ ఎడిటర్‌గా వ్యవహరించిన ఆమె వెల్లడించిన అంశాలు అర్చనాకుమారి మాటల్లోనే...

నేను ఎదగాలని కోరుకుంది వారే...

నాకు ఇన్‌స్పిరేషన్ అంటే మా అమ్మ, అత్తతో పాటు మా అమ్మమ్మ, నానమ్మను గుర్తు చేసుకుంటాం. వారు చదువుకున్న దాఖలాలు లేవు. అయినా మంచి విషయాలు చెబుతుండేవారు. ఎప్పుడూ నేను పెద్ద స్థాయికి రావాలని కలలు కన్నారు. నేను కొన్నిసార్లు అవుతుందో.. లేదో.. అని అనుకున్నప్పుడు నాకు తోడుగా నిలిచారు. మనకు కష్టం వచ్చిన సమయంలో ఎవరో ఒకరు మన పక్కన ఉంటారు. దానిని మనం గుర్తించాలి.

ఓటమితోనే లోపాలు తెలుస్తాయి..

ప్రతీ మహిళ అడ్డంకులను ఎదుర్కొంటూ ముందుకు వెళ్లాలి. ఎప్పుడైనా ఓటమి ఎదురైతే కుంగిపోవద్దు. ఓటమితోనే మనలోని లోపాలను గుర్తించగలుగుతాం. తప్పిదం మన వల్ల జరిగిందా.. సహజంగా జరిగిందా అనే విషయాలపై దృష్టి పెట్టాలి. అప్పుడే కొత్త పాఠాలు నేర్చుకోగలుగుతాం. లక్ష్యాలను నిర్దేశించుకోవడమే కాక అందుకు తగ్గట్టుగా కృషి చేయాలి. మహిళలు జీవితంలో ఎదగాలన్నా.. రాణించాలన్నా ముందు యాక్సెప్టెన్సీ, ఆ తర్వాత ప్రణాళిక చాలా ముఖ్యం.



కథనాలను పరిశీలిస్తున్న న్యాయమూర్తులు ఉమాదేవి, అర్చనాకుమారి

రేపటి గురించి ఆలోచన వద్దు..

రేపు ఏం జరుగుతుందో అనే ఆలోచన మనసులోంచి తీసేయాలి. వాస్తవంగా ఏం చేస్తున్నామో ముఖ్యమని గుర్తించి ప్రతీ మహిళ వాస్తవంలో జీవించాలి. పోల్చుకోవడం తప్పేం కాకున్నా విజ్ఞతతో నిర్ణయం తీసుకోవాలి. ఎవరి నుంచి అయినా చెడు ప్రభావం పడుతున్నా.. వారిని చూసి అలాంటివి చేయకూడదనేది నేర్చుకోవాలి. మాట సాయంతో, ఇతరత్రా సాయం చేసే వారిని చూసి అలా ఉండాలనే ఆలోచనలు మనకు రావాలి. విజ్ఞానాన్ని పంచే వారితో మాట్లాడుతుండాలి.

చైతన్యంతోనే చెత్త సమస్యకు చెక్

- పుణే మహానగరంలో పక్కాగా అమలవుతున్న విధానం
- అధ్యయనం చేసిన కేఎంసీ బృందం



తడి, పొడి చెత్త వేర్వేరుగా వేస్తున్న పుణె వాసులు

ఖమ్మంమయూరిసెంటర్: పట్టణాల్లో పారిశుద్ధ్య వ్యవస్థ మెరుగుపడడానికి యంత్రాంగం కృషికి తోడు ప్రజల చైతన్యమే కీలకంగా నిలుస్తోంది. ఈ విషయాన్ని పుణే మహా నగరవాసులు రుజువు చేశారు. ఖమ్మం నగర పాలక సంస్థ బృందం అక్కడ పర్యటిస్తుండగా శుక్రవారం పలు ప్రాంతాల్లో చెత్త సేకరణ, నిర్వహణను పరిశీలించారు.

ప్రజలే నేరుగా..

చాలాచోట్ల తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలని సూచిస్తున్నా ప్రజలు పెద్దగా పట్టించుకోరు. కానీ పుణేలో మాత్రం కార్మికులు తోపుడు రిక్షాలతో వస్తుండగా... ప్రజలే నేరుగా తడి, పొడి వ్యర్థాలు వేరుగా వేస్తుండడాన్ని కేఎంసీ బృందం గుర్తించింది. ఈ విధానం కేఎంసీలోనూ అమలుచేస్తే మంచి ఫలితాలు వస్తాయనే భావనకు వచ్చారు.

ఫంక్షన్ హాళ్లలో బయోగ్యాస్ ఉత్పత్తి

పుణేలోని ఫంక్షన్ హాళ్లలో మిగిలే ఆహార వ్యర్థాలను చెత్త సేకరణ వాహనాలకు ఇవ్వకుండా సొంతంగా బయోగ్యాస్ తయారు చేస్తున్నారు. చిన్నప్లాంట్ ఏర్పాటు చేసి మిగిలే ఆహార, కూరగాయల వ్యర్థాలను వేస్తుండడంతో కుళ్లిపోయి గ్యాస్ తయారవుతోంది. ఆతర్వాత మిగిలే వ్యర్థాలు మట్టిగా మారడంతో మొక్కలకు వినియోగిస్తున్నారు. దీంతో నగర పాలక సంస్థపై చెత్త సేకరణ భారం తగ్గింది. ఒక్కో యూనిట్‌కు రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు వెచ్చించాల్సి ఉండగా, ఇదే విధానం ఖమ్మంలోనూ అమలుకు సాధ్యాసాధ్యాలపై చర్చించారు. కాగా, కేఎంసీ ఏఓ శివలింగం, టీపీఎస్ నరేష్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్లు హసిని, సుజిత, కమ్యూనిటీ కోఆర్డినేటర్ ద్రౌపది, ఇతర సిబ్బంది పీఎంసీ కార్యాలయాన్ని పరిశీలించారు. ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం, కార్మికులకు డ్రస్, గ్లౌజులు, బూట్ల పంపిణీ, ఉద్యోగుల సంక్షేమ నిధి వివరాలు సేకరించారు. అయితే, కేఎంసీలో మాదిరి ఈ-ఆఫీస్ అక్కడ లేకపోవడం, ఆన్‌లైన్ అకౌంట్ విధానంలోనూ పీఎంసీ కొంత వెనుకబడిందని గుర్తించారు. పుణెలో ఖమ్మం మేయర్ పి.నీరజ నేతృత్వాన కార్పొరేటర్లు, అధికారుల బృందం చేపట్టిన రెండు రోజుల అధ్యయనం శుక్రవారంతో ముగిసింది.

గనిలో 'నారీ'మణులు

భూగర్భంలో సాహస విధులు

- సింగరేణిలో సర్దార్, ఓవర్‌మెన్ పర్యవేక్షణ బాధ్యతలు
- ఏటా సంస్థలో పెరుగుతున్న మహిళా ఉద్యోగులు



కొత్తగూడెంలోని పీవీకే-5 ఇంక్లైన్ గనిలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): గతంలో వంటింటికే పరిమితమైన మహిళలు నేడు ఉద్యోగ నిర్వహణలోనూ రాణిస్తున్నారు. అయితే, కొన్నాళ్ల పాటు కార్యాలయాలకే పరిమితమయ్యే ఉద్యోగాలను మాత్రమే ఎంచుకోగా ఇప్పుడు ఈ స్థితినీ దాటేశారు. క్లిష్టమైన పరిస్థితులు, సంక్లిష్టమైన బాధ్యతలు నిర్వర్తించడానికీ అతివలు వెనుకాడడం లేదు. అందులో భాగంగానే సింగరేణిలోని భూగర్భ గనుల్లో బొగ్గు ఉత్పత్తి, పర్యవేక్షణ బాధ్యతలను నిస్సంకోచంగా, విజయవంతంగా నిర్వర్తిస్తున్నారు. పురుషులు సైతం భయంభయంగా పనిచేసే రెస్క్యూ విధులనూ మహిళలు ఎంచుకుంటుండడం విశేషం.

మైనింగ్ ఆఫీసర్లుగా మహిళలు..

సింగరేణి సంస్థలో సుమారు 56 విభాగాలు విధులు నిర్వర్తిస్తేనే బొగ్గు ఉత్పత్తి సాధ్యమవుతుంది. వీటన్నింటిలోనూ గతంలో పురుషులే ఉండేవారు. అయితే, సంస్థ ఇటీవల నియామకాల్లో మహిళలకు అన్ని విభాగాల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించడం.. డిపెండెంట్ ఉద్యోగాల కల్పనలోనూ సానుకూలంగా వ్యవహరిస్తుండడంతో ఇప్పుడు సంస్థ వ్యాప్తంగా 2వేల మంది వరకు మహిళలు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో కొందరు ఎగ్జిక్యూటివ్(అధికారుల) హోదాలో ఎలక్ట్రికల్, మైనింగ్, సివిల్, ఎకౌంట్స్, ఎస్టేట్స్, పర్సనల్ విభాగాల్లో ఉండగా.. ఉత్పత్తికి సంబంధించి మరో 16 విభాగాల్లోనూ మహిళామణులు విధులు నిర్వహిస్తున్నారు. కాగా, సింగరేణిలో మైనింగ్ ఆఫీసర్ విధులు క్లిష్టంగా ఉంటాయి. గనుల్లో బొగ్గు ఉత్పత్తి కోసం బ్లాస్టింగ్ చేయడం, గనుల్లో వెలువడే గ్యాస్‌ను గుర్తించడమే కాక మైనింగ్ విభాగంలో సర్దార్, ఓవర్‌మెన్లకు విధులు కేటాయించాల్సి ఉంటుంది. ఇలాంటి విధులను మహిళలు అలవోకగా నిర్వర్తిస్తూ భేష్ అనిపించుకుంటున్నారు.

'ఆమె' రాణిస్తోంది..
మరికొన్ని కథనాలు 9లో

పంటలు ఎండిపోకుండా సాగునీరు

- ప్రభుత్వ కార్యక్రమాలు పటిష్టంగా అమలుచేయాలి
- కలెక్టర్, అధికారులతో సమీక్షలో మంత్రి పొంగులేటి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, పక్కన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అధికారులు

కూసుమంచి: ప్రభుత్వ కార్యక్రమాలను పటిష్టంగా అమలుచేసే బాధ్యత అధికారులదేనని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు శుక్రవారం చెక్కులు పంపిణీ చేసిన మంత్రి, మహిళా మత్స్యకారులు చేపలు విక్రయించేందుకు సబ్సిడీపై మంజూరైన సంచార వాహనాలను అందజేశారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఎండలు ముదురుతున్నందున పంటలు ఎండిపోకుండా సాగునీరు సరఫరా చేయాలని, సాగర్ జలాలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ తాగు, సాగునీటికి ఇబ్బందులు రానివ్వొద్దని సూచించారు. అలాగే, భక్తరామదాసు ఎత్తిపోతల పథకం, మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి భూసేకరణ, పరిహారంపై సూచనలు చేశారు. ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి మార్కెట్ రహదారికి అవసరమైన భూమి సేకరించాలని, నియోజకవర్గంలో దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. కాగా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు చేపట్టేలా అవగాహన కల్పించాలని మంత్రి తెలిపారు. ఆర్డీఓ నర్సింహారావు, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ ఎస్‌ఈలు హేమలత, మంగళంపూడి వెంకటేశ్వర్లు, ఈఈలు అనన్య, యుగంధర్, పుష్పలత, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు. కాగా, మండలంలోని జుజుల్‌రావుపేటలో శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 9న ప్రతిష్ఠాపన పూజలు జరగనుండగా మంత్రి పొంగులేటి పూజలు చేశారు. అనంతరం తురకగూడెం, కేశ్వాపురంల్లో సీసీ రహదారుల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.

■ ఖమ్మంరూరల్/ఖమ్మం వన్‌టౌన్/ఖమ్మం వ్యవసాయం: ఇందిరమ్మ ఇళ్లను మండలంలోని ఆరెంపులకు పైలట్ ప్రాజెక్టుగా కేటాయించగా, విడతల వారీగా అర్హులందరికీ ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రూరల్ మండలం ఆరెంపుల, బారుగూడెం, ఏదులాపురంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. కాగా, మంత్రిని రియల్ ఎస్టేట్ అసోసియేషన్, బిల్డర్స్ అసోసియేషన్ బాధ్యులు కలిసి ఎల్‌ఆర్‌ఎస్ ఫీజుపై రాయితీ ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పాత జీపీల్లోని లే ఔట్ల ప్లాట్లకు కూడా ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు కట్టించుకోవాలని కోరారు. ఆతర్వాత రెడ్డిపల్లికి చెందిన సీపీఐ నాయకుడు లింగా వెంకటనారాయణ తల్లి మల్లమ్మ మృతి చెందగా మంత్రి నివాళులర్పించారు. ఇటీవల మృతి చెందిన డిప్యూటీ సీఎం పీఏ తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను మంత్రి పొంగులేటి పరామర్శించారు. కాగా, విద్యుత్ ఎస్ఈగా కొద్దిరోజుల క్రితం బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసాచారి మంత్రి పొంగులేటిని మర్యాదపూర్వకంగా కలిశారు.

నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి

అధికారులతో సమీక్షలో జెడ్పీ సీఈఓ దీక్షారైనా



మాట్లాడుతున్న సీఈఓ దీక్షారైనా, పక్కన అధికారులు


ఖమ్మంవన్‌టౌన్: పెండింగ్ ఉన్న వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా పర్యవేక్షిస్తూ చెల్లింపులు సైతం చేయాలని జిల్లా పరిషత్ సీఈఓ దీక్షారైనా ఆదేశించారు. ఖమ్మంలోని డీపీఆర్‌సీ భవనంలో ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలతో శుక్రవారం సమావేశమైన ఆమె పలు అంశాలపై సమీక్షించారు. పెండింగ్ బిల్లులను సోమవారం సాయంత్రంలోగా చెల్లించాలని, ఉపాధి పథకం చెల్లింపులు సైతం పూర్తిచేయాలని తెలిపారు. అంతేకాక గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి, వెనుకబడిన గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంకా ఎరువు తయారీ, నర్సరీల్లో షేడ్‌నెట్ల ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్వహణ, ఇందిరమ్మ లబ్ధిదారులు స్వయం సహాయక సంఘాల సభ్యులైతే రుణాల మంజూరు, ఉపాధి పథకంలో పనుల కల్పనపై దృష్టి సారించాలని సీఈఓ తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ సన్యాసయ్య, డీపీఓ ఆశాలత, డీఎల్‌పీఓ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో ఓకే.. బయటే భయం !



మహిళలపై కొనసాగుతున్న వివక్ష ● ఇంకా కనిపిస్తున్న ఆడామగ తేడా

సమాజంలో అందరూ సమానేమనే భావన నానాటికీ పెరుగుతోంది. పురుషులతో సమానంగా కుటుంబ పోషణలో పాలు పంచుకుంటున్న మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తుండడం ఇందుకు కారణమవుతోంది. కానీ అతివలపై వివక్ష మాత్రం కొన్నిచోట్ల కొనసాగుతూనే ఉంది. అయితే ఇళ్లలో తల్లిదండ్రులు, తోబుట్టువుల నుంచి ఆ పరిస్థితి ఎదురుకాకున్నా... పని ప్రదేశాలు, విద్యాసంస్థలు, బస్టాండ్ల వంటి చోట మాత్రం ఈ సమస్య తప్పడం లేదు. మహిళా దినోత్సవం సందర్భంగా ఖమ్మం, కొత్తగూడెం జిల్లా కేంద్రాల్లో 100 మంది మహిళలను సర్వే చేయగా ఈ విషయం వెల్లడైంది. 'సాక్షి' అడిగిన ప్రశ్నలకు వారు ఇచ్చిన సమాధానాలు ఇలా ఉన్నాయి. – ఖమ్మంమయూరిసెంటర్/కొత్తగూడెంఅర్బన్





జయహో.. జనయిత్రి

- మహిళల రక్షణ, అభివృద్ధే ధ్యేయంగా..
- కార్యకర్తల కష్టసుఖాల్లో అండగా ఉంటూ, ప్రజలతో మమేకం.

మధిర : రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ ఛైర్మన్ మల్లు నందిని నిరంతరం ప్రజల్లో ఉంటూ పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందుతున్నారు. నిరంతరం శ్రమిస్తూ, ప్రజలతో మమేకమవుతూ ముదుకు సాగుతున్నారు. మల్లు భట్టి విక్రమార్క రాష్ట్ర రాజకీయాల్లో నిత్యం బిజీగా ఉంటూ, రాష్ట్ర ప్రభుత్వంలో కీలకంగా ఉండడంతో పాటు కాంగ్రెస్ పార్టీ జాతీయ రాజకీయాల్లో సైతం బిజీగా ఉంటున్నారు. మల్లు నందిని నియోజకవర్గంలో కార్యకర్తల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, నాయకులకు కొండంత అండగా ఉంటున్నారు. మండలాల్లో పార్టీ నాయికులను సమన్వయించేస్తూ అన్ని వర్గాల ప్రజల అభిరుచులకు అనుగుణంగా ముందుకు వెళుతున్నారు. అంతేకాకుండా తన భర్త హోదాను దుర్వినియోగం చేయకుండా, అధికారిక కార్యక్రమాల్లో జోక్యం చేసుకోకుండా ఆమె తనదైన శైలిలో రాణిస్తున్నారు. అందరినీ చిరునవ్వుతో పలకరిస్తూ, ఆప్యాయంగా చేరదీస్తూ మల్లు నందిని చేస్తున్న కార్యక్రమాలకు ప్రజలు జేజేలు పలుకుతున్నారు. నియోజకవర్గ ప్రజలు ఆప్యాయితగా అమ్మ అంటూ పిలిస్తే, నేనున్నానంటూ కార్యకర్తలకు వెన్నుదన్నుగా ఉంటున్నారు. అమ్మ ఫౌండేషన్ ద్వారా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహణ, ప్రతిభ కలిగిన విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్‌లు పంపిణీ, వికలాంగులకు ట్రై సైకిళ్ళు ఉచితంగా పంపిణీ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల అభిమానాన్ని పొందుతున్నారు. నియోజకవర్గానికి చెందిన వ్యక్తులు ఎవరైనా ప్రమాద ఘటనలో గాయపడినా, మృతి చెందిన వారి కుటుబాలను పరామర్శిస్తూ వారికి అండగా ఉంటూ భరోసా కల్పిస్తున్నారు. ఆస్పత్రి యాజమాన్యాలకు ఫోన్ చేస్తూ వైద్య బిల్లులు తగ్గించేలా కషి చేస్తున్నారు. నియోజకవర్గ ప్రజలు, నాయికులు, కార్యకర్తలు ఆమెను తల్లైవిగా పిలుస్తూ ఫ్లెక్సీలు కడుతూ నందినమ్మకు మహిళా దినోత్సవం సందర్భంగా అభినందనలు తెలుపుతున్నారు. ఖమ్మం జిల్లాలో అమ్మ ఫౌండేషన్ తరపున అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.


శ్రీమతి మల్లు నందిని, అమ్మ ఫౌండేషన్ ఛైర్మన్


విద్యావంతులైన మహిళలందరూ.. సమాజంలో మార్పు తేవడానికి ధైర్యంగా ముందుకు సాగాలని, మహిళలంతా ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకొని, సవాళ్ళను స్వీకరించి, ఉన్నత భవిష్యత్తును నిర్మించుకోవాలని కోరుకుంటూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

వై. లావణ్య, కరస్పాండెంట్,
వికాస్ స్కూల్, ఖమ్మం


మహిళలందరూ విద్యను అభ్యసించాలి, ఆర్థికంగా ఎదగాలి. సంతానలేమి, గర్భాశయ, వెన్నెముక, నరాలు మరియు కీళ్ళనొప్పుల సమస్యలతో బాధపడే పేద ప్రజలకు అధునాతన వైద్యం అందించడం సంతోషంగా వున్నది.

డా॥ అస్మా
గైనకాలజిస్ట్,
షిఫా హాస్పిటల్, ఖమ్మం


మహిళలు విద్యావంతులై తమతోపాటు కుటుంబాన్ని, సమాజాన్ని అభివృద్ధివైపు నడిపించాలి. సమస్యలతో వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు నావంతుగా సేవలందించడం నాకు తృప్తిగా వున్నది. మహిళామణులందరికీ మహిళాదినోత్సవ శుభాకాంక్షలు.

కొదారు సుజాత
కమీషనర్, పాల్వంచ మున్సిపాలిటీ,
ఇన్‌ఛార్జ్ : కొత్తగూడెం మున్సిపాలిటీ.


మహిళలు అన్నిరంగాలలో ఎదగాలి. స్కిన్ స్పెషలిస్ట్‌గా పేద మధ్యతరగతి ప్రజలకు నిరంతరం తక్కువ ఖర్చులో ఆధునిక వైద్య సేవలు అందించటం సంతోషంగా వున్నది.

డా॥ పోట్ల శాలిని
డెర్మటాలజిస్ట్ మరియు
కాస్మోటాలజిస్ట్,
శాలిని స్కిన్ క్లీనిక్, ఖమ్మం


సమాజ అభివృద్ధిలో మహిళల పాత్రే కీలకం. మహిళలు స్వయంకృషి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి. ఖమ్మంలో ఏకైక ఎండోక్రైనాలజిస్ట్, మరియు మహిళా ఫిజీషియన్‌గా పేద మరియు మధ్యతరగతి ప్రజలకు వైద్యసేవలు అందించటం సంతోషంగా వుంది.

డా॥ కావ్యచంద్ యాలముడి
సి.ఇ.ఓ., కావ్య హాస్పిటల్, ఖమ్మం